



తాడేపల్లిగూడెం రూరల్ మండలం మోదుగగుంటలో వర్షం

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భీమవరం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీని కారణంగా మరో మూడు రోజులు భారీ వర్షసూచన ఉందన్నారు. గంటకు 30-40 కి.మీ. వేగంతో తీరం వెంబడి గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. గోదావరి నదికి వరద ఉధృతి దృష్ట్యా ప్రజ లెవ్వరూ నదిలోకి వెళ్లవద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయ వద్దన్నారు. అధికారులంతా వారి ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని, ఏ ఒక్కరికి సెల వులు లేవని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08816 299181 నంబర్ ఏర్పాటు చేశారని సమాచారం అందించాలని కోరారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

అల్పపీడనం కారణంగా వాతావరణ శాఖ రానున్న మూడు రోజులు అధిక వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కూడా కార్యక్రమం జరగదని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వదలని వానగండం



కే.పెంటపాడులో ఇంకా ముంపులోనే వరి పొలాలు

వాన గండం ఇంకా వదల్లేదు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. మూడురోజుల క్రితం కురిసిన వర్షాలకు జిల్లాలో 24,500 ఎకరాలల్లో పంట నీట మునిగింది. పంట పొలాల నుంచి నీరు బయటకు వెళ్లకుండానే మళ్లీ వర్షాలు ప్రారంభమయ్యాయి. బంగాళాఖాతంలో ప్రస్తుతం అల్పపీడనం ఏర్పడింది. దీంతో భారీ వర్షాలు కురుస్తాయని, మరో వాయుగుండం ఏర్పడనుందని విపత్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. దీంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. గతేడాది నాట్లు పూర్తయిన తరువాత 28 వేల ఎకరాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి.



గణపవరం మండలం అర్ధవరంలో చెరువుల్లా చేలు..

ఇంకా ముంపులోనే పొలాలు
ఏకధాటిగా వాన.. మునిగిన వరిచేలు
మరో మూడు రోజులపాటు వర్షాలు
వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో మరింత ఆందోళన

పెనుగొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బుధవారం కురిసిన వర్షంతో ఇంకా పొలాల్లోని వర్షపు నీరు చెరువులను తలపిస్తూ ఉన్నాయి. మండలంలోని పెనుగొండ, కొఠాలపర్రు గ్రామాల్లో ఇంకా నీరు లాగక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి వృథా అయిపోయిందని మరలా పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నక్కల కాలువలో నీరు ముందుకు పారడం ఎలా ఉన్నా అది వెనక్కి ఎగ దన్ని అక్కడి నుంచి పొలాల్లోకి వస్తున్నదని వాపోతు న్నారు. నక్కల కాలువను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

ఆచంట (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులు క్రితం భారీ వర్షం కారణంగా ఇంకా నేటికి అనేక చోట్ల పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. ఆదివారం ఏకదాటిగా వర్షం పడుతూనే ఉంది. ఇపుడిపుడే పొలాలు ముంపు నుంచి బయట పడుతున్న తరుణంలో ఈ వర్షానికి పంట పొలాలు ముంపు బారిన పడే అవకాశం ఉంది. ఇటీవల వేసిన వరి నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి): వర్షం ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. ఇప్పటికే తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, రేడ్లు నీటితో నిండాయి. ఎర్రకాలువ పరివాహక రైతులు ఎగువన కురుస్తున్న వర్షాలు ఎప్పుడు తమ పొలాల్లోకి వరనీరు ముంచెత్తుతుందో అని భయపడుతున్నారు. ఇదిలా ఉంటే కూరగాయల సాగుచేసే వెంకట్రామన్నగూడెం, లింగారాయుడుగూడెం, అప్పారావుపేట తదితర ప్రాంతాల్లో కూరగాయల సాగుకు ఊతాన్నిస్తోంది.

పెంటపాడు(ఆంధ్రజ్యోతి) : పెంటపాడు మండలంలోని పెంటపాడు, కే.పెంటపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి, వల్లూరుపల్లి తదితర గ్రామాల్లో వరి పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. నాట్లు వేసిన పొలాలు కావడంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. భారీ వర్షాలు ఉన్నాయంటూ తుఫాను హెచ్చరికలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.8 వేలు చొప్పున రైతులు పెట్టుబడులు పెట్టారు. ఒకవేళ వేసిన నారు కుళ్లిపోతే మరలా కొని తెచ్చుకుని నారు వేద్దామన్నా దొరికే అవకాశం లేదని, ఒకవేళ నారు కుళ్లిపోతే ఈ ఏడాది సార్వా పంట పోయినట్లేనని వాపోతున్నారు.

గణపవరం (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఇటీవల వేసిన వరినాట్లు కనిపించని విధంగా ముంపునకు గురయ్యాయి. బుధవారం కురిసిన భారీ వర్షానికి గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో వరిపైరు నీటమునిగింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా వాయుగుండ ప్రభావంతో వర్షాలు జోరందుకున్నాయి. ఇప్పటికే మండలంలో 17,700 ఎకరాలు ముంపునకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి, అర్ధవరం, పిప్పర, కేశవరం, కోమర్రు, మొయ్యేరు తదితర గ్రామాల్లో వరినాట్లు నీటిముంపులో ఉన్నాయి. నీరు బయటకు పంపటానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

పెరుగుతున్న గోదావరి

భద్రాచలం వద్ద నీటి మట్టం 34 అడుగులు

కుక్కునూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 34 అడుగులకు చేరుకుంది. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య లోలెవెల్ గుండేటి వాగు కాజ్‌వే నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పెరుగుతున్న గోదావరి వరదతో రైతాంగంలో ఆందోళన నెలకొంది. గోదావరి తీరంలో పత్తి, అరటి పంటలు నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ రమేశ్‌బాబు అధికారులు, స్థానిక రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అప్రమత్తంగా ఉండాలని రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.గోదా వరి వరద ప్రవాహం పెరుగు తోందని, పరీవాహక ప్రాంత మత్స్యకారులు, ప్రజలు గోదావరినదిలో వేటకు వెళ్లరాదని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ సూచించారు.

పెన్షన్..పరేషాన్



అనర్హుల పెన్షన్ తొలగింపు
వైసీపీ హయాంలో సదరం సర్టిఫికెట్ల జారీలో ఒత్తిడి
ప్రత్యేక సర్వే ద్వారా అనర్హుల గుర్తింపు
నోటీసులు ఇస్తున్న ప్రభుత్వం

భీమవరం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) :వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా పెన్షన్‌లు ఇచ్చేశారు. నడచి వెళ్తున్నవారికి కూడా బెడ్ రిడెన్ పెన్షన్‌దారులుగా గుర్తించారు. ధ్రువీకరణ పత్రాల మంజూరులో మాయాజాలం ప్రదర్శించారు. వైద్యులను ప్రసన్నం చేసుకుని, ఒత్తిడి తెచ్చి సదరం సర్టిఫికెట్లు పొందారు. దివ్యాంగ పెన్షన్‌లను తీసుకుంటున్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పెన్షన్‌ల సొమ్మును పెంచింది. దివ్యాంగులకు రూ.3 వేల నుంచి 6 వేలు పెన్షన్ ఇస్తోంది. మరో వైపు మంచానికే పరిమితమైన వారికి పెన్షన్‌ను రూ.10 వేల నుంచి 15 వేలకు పెంచింది. గత ప్రభుత్వంలో అనర్హుల్లో కూడా పెన్షన్‌లు పొందుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఎక్కువగా వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు ఇటువంటి పెన్షన్‌లు పొందినవారిలో ఉన్నారు. అనర్హులకు లబ్ధి చేకూరుతోందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం సర్వే చేపట్టింది. అనర్హులను గుర్తించింది. వారందరూ మరోసారి సదరం సర్టిఫికెట్లు తీసుకోవాలని నోటీసులు జారీ చెయ్యనున్నారు. దివ్యాంగుల్లో దాదాపు 20 శాతం మంది సర్వేలో అనర్హులుగా ఉన్నారు. బెడ్ రిడెన్ (మంచంపై నుంచి లేవలేని) బాధితులకు సంబంధించి సగం మంది అనర్హులుగా ఇటీవల వైద్యుల బృందం సర్వే చేసి గుర్తించింది.

జిల్లావ్యాప్తంగా 2,26,995 మందికి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.97.74 కోట్లు కోట్లు పెన్షన్ రూపంలో అందిస్తోంది. జిల్లాలో బెడ్ రిడెన్‌లో ఉన్న పెన్షన్‌దారులు 1,510 మంది ఉండగా 27,460 మంది దివ్యాంగులు పెన్షన్ తీసుకున్నట్లుగా గుర్తించారు. ముందుగా బెడ్ రిడెన్ పెన్షన్ దారుల్లో అనర్హులను గుర్తించేందుకు ప్రత్యేక టీమ్‌ను అప్పట్లో ఏర్పాటు చేశారు. టీమ్‌లో జనరల్ డాక్టర్, ఆర్థోపెడిక్, సంబంధిత అధికారితో ఏర్పాటు చేశారు. ముందుగా పెన్షన్ దారుడికి నోటీసులు అందించి తనిఖీలు చేశారు. జనవరి 6 నుంచి 31వ తేదీవరకు వెరిఫికేషన్ చేశారు. సంబంధిత వ్యక్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తరువాత దివ్యాంగులకు ప్రత్యేక సదరం క్యాంపులు ఏర్పాటు చేసి వారి సర్టిఫికెట్లు కరెక్టుగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించి అందులో అనర్హులను గుర్తించే చర్యలు చేపట్టారు. మండలాల వారీగా ఒకచోట సదరం క్యాంపులు ఏర్పాటు చేసి సచివాలయాల ద్వారా వారికి పంపించి పరిశీలన చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో అనర్హులను గుర్తించారు.

బెడ్ రిడెన్ పెన్షన్‌లో 750 మంది గుర్తింపు

మంచానికి, వీల్‌ఛైర్‌కే పరిమితం అయిన వారు 1,510 మంది ఉండగా వారిలో అనర్హులుగా దాదాపు 750 మంది వరకు ఉన్నట్లు గుర్తించారని సమాచారం. వీరికి పెన్షన్ నిలుపుదల చేస్తున్నారని, ముందుగా వీరికి నోటీసులను జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

దివ్యాంగుల్లో 20 శాతం మంది

జిల్లాలో దివ్యాంగ పెన్షన్‌లు పొందేవారు 27,460 మంది ఉన్నారు. వీరిలో దాదాపు 20 శాతం మంది అనర్హులుగా ఉన్నట్లు గుర్తించారు. వీరందరికి సచివాలయాల వారీగా నోటీసులు జారీచేస్తున్నారు. మరోసారి సదరం సర్టిఫికెట్ చేయించుకుని రావాలని అప్పుడు పెన్షన్ ఇస్తారని చెబుతున్నారు. ఇలా అనర్హులకు గత నెలల్లోనే పెన్షన్ నిలుపదల చేసినట్లు చెబుతున్నారు.

అనర్హుల్లో 60 ఏళ్లు దాటినవారు ఉంటే మామూలు పెన్షన్

బెడ్ రిడెన్, దివ్యాంగుల పెన్షన్‌లలో అనర్హుల జాబితాలో 60 ఏళ్లు దాటిన వారు ఉంటే వారికి వృద్ధాప్య పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. వితంతువులు ఉంటే వారికి వితంతు పెన్షన్‌లు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

పిచ్చి కుక్క స్వైర విహారం.. 31 మందికి గాయాలు



7

ఆగిన లారీని ఢీకొట్టిన మరో లారీ



డ్రైవర్, క్లీనర్ మృతి

హైదరాబాద్‌కు స్పెషల్ బస్సులు

భీమవరం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వరుసగా మూడు రోజులపాటు సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి సొంత ఊర్లకు వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్ వెళ్లే బస్సులు ఫుల్ అయ్యాయి. దీంతో ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని నాలుగు డిపోలనుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. రెగ్యులర్ బస్సులు 13 కాకుండా అదనంగా 5 సర్వీసులను పంపించారు. ఇందులో భీమవరం డిపో నుంచి 2 సర్వీసులు ఉండగా తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల నుంచి ఒక్కో సర్వీసులను హైదరాబాద్‌కు పంపించారు. రెగ్యులర్‌గా భీమవరం డిపో నుంచి 2, తాడేపల్లిగూడెం నుంచి 4, తణుకు నుంచి 3, నరసాపురం నుంచి 4 సర్వీసులు నడుస్తాయని తెలిపారు. కొన్ని డిపోల్లో డ్రైవర్ల ఇబ్బంది ఉండటంతో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చెయ్యలేకపోయినట్లు తెలుస్తోంది.

ఉచిత ప్రయాణాల మోత


ఆదివారం తెగ తిరిగేశారు



వరుస సెలవులు పూర్తి కావడం.. ఉచిత బస్సు ప్రయాణాలు అందుబాటులోకి రావడంతో ఆదివారం మహిళా ప్రయాణికులు మోత మోగించారు. పెళ్ళిళ్లు, శుభకార్యాలు కూడా పనిలో పనిగా కానిచ్చేశారు. కుటుంబ సమేతంగా ఆధార్ కార్డులు పెట్టుకుని ప్రయాణాలు చేసేశారు. కొందరు కండక్టర్లు అయితే విధిగా ఆధార్‌కార్డు ఒరిజినల్ తెచ్చుకోక పోతే ఎలా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. టిక్కెట్ తీసు కోవాల్సిందేనంటూ.. మాకు ఇబ్బంది అంటూ టికెట్లను జారీ చేశారు. మహిళలు ఎడాపెడా ఆదివారం రాకపో కలతో బస్టాండ్లన్నీ సందడిగా మారాయి. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణికులకు తాకిడి పెరిగింది. తొలిరోజు సుమారుగా 3 వేల లోపు మహిళలు ఉచిత ప్రయా ణాలు చేయగా, రెండోరోజు శనివారం 30 వేల రాక పోకలు సాగించారు. ఆదివారం రాత్రి ఏడుగంటల సమయానికి దాదాపు 38 వేల మంది ఉచిత బస్సు ప్రయాణాలు సాగించినట్టు అధికారులు చెబుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగేనా ?

జిల్లాలో 500 హెక్టార్ల సాగు లక్ష్యం
రైతులకు సబ్సిడీపై ఎరువులు
అంతర పంటల ఏర్పాటుకు సాయం
ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వ ప్రయత్నం ఫలిస్తుందా.. జిల్లాలో వరి అధికంగా సాగుచేసే రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు కూటమి సర్కార్ యోచిస్తోంది. అందులో భాగంగా జిల్లా వాతావరణ పరిస్థితులు, దిగుబడి ఆదాయం ఇతర అంశాలు దృష్టిలో ఉంచుకుని ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను మళ్లించేందుకు కృషి చేస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్క తాడేపల్లిగూడెం మండలంలో మాత్రమే ఈ ఆయిల్ పామ్ సాగు జరుగుతుంది. వాటితో పాటు జిల్లాలో పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, నరసాపురం యలమంచిలి, పాలకొల్లు, మొగల్తూరు మండలాల్లో ఈ సాగు విస్తరించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తోంది. ఇందుల్లో భాగంగా గత సంవత్సరం 200 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లగా 175 హెక్టార్లలో సాగు విస్తరించారు. తాజాగా జిల్లాలో 500 హెక్టార్లలో సాగు చేయించేందుకు అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు.

ఇంకా 435 హెక్టార్లలో..

జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఇప్పటికే లక్ష్యాలు నిర్దేశించుకోగా ఇప్పటికి 65 హెక్టార్లలోనే ఈ సాగు విస్తరించారు. ఇంకా మరో 435 హెక్టార్లలో విస్తరించాల్సి ఉంది. జిల్లాలోని పెనుగొండ ఆచంట, పెను మంట్ర, నరసాపురం యలమంచిలి, పాలకొల్లు మొగల్తూరు మండలాల్లో ఈ సాగు విస్తరించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వ సబ్సిడీ

ఆయిల్ పామ్‌తో పాటు ఉద్యాన పంటలు విస్తరించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అంతర పంటల ఏర్పాటుకు ఎకరాకు రూ.లక్ష వరకూ సబ్సిడీతో మొక్కలు, ఎరువులు, ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే ఉపాధి కూలీలను ఉపయోగించుకునే వెసులు బాటు కల్పిస్తోంది. దీంతో ప్రతీ రైతు ఈ దిశగా ఆలోచించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



పెరిగిన ఉల్లి ధర

మహారాష్ట్రలో వర్షాల ప్రభావం
తాడేపల్లిగూడెం మార్కెట్‌లో క్వింటా రూ.1800 నుంచి రూ.2400 వరకు అమ్మకాలు

7

తమ్మిలేరులో చిక్కిన భారీ చేప


మత్స్యకారులకు చిక్కిన చేప

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టులోకి ఆదివారం చేపల వేటకు వెళ్లిన పోతనపల్లి మత్స్యకారులకు భారీ చేప చిక్కింది. వాలగ జాతికి చెందిన ఈ చేప బరువు సుమారు 20 కేజీలు ఉందని, ఇటువంటి చేపలు అరుదుగా దొరుకుతుంటాయని, ఇది రూ.4 వేలకు అమ్ముడుపోయినట్టు మత్స్యకారులు చెప్పారు. తమ్మిలేరు ప్రాజెక్టుకు వరద వస్తున్నందున జలాశయంలోను, ఏటిఒడ్డు గ్రామాల్లో జోరుగా చేపల వేట సాగుతోంది.

పెరిగిన ఉల్లి

- మహారాష్ట్రలో వర్షాల ప్రభావం
- తాడేపల్లిగూడెం మార్కెట్‌లో క్వింటా రూ.1800 నుంచి రూ.2400 వరకు అమ్మకాలు



తాడేపల్లిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : ఉల్లి ధర మార్కెట్లో పెరిగింది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ధరలు పెరిగాయి. తాడేపల్లిగూడెంలో గత వారం క్వింటా రూ.1400 నుంచి రూ.1700 మధ్య హోల్‌సేల్‌గా విక్రయించారు. ఈ వారం క్వింటా రూ.1800 నుంచి రూ.2400 మధ్య విక్రయాలు జరిగాయి. రిటైల్ వ్యాపారులు వీటిని రెండు రకాలు కలిపి రూ.100కు నాలుగు కిలోల చొప్పున అమ్ముతున్నారు. మహారాష్ట్రంలో కురిసిన వర్షాలకు కొంతమేరకు ఉల్లి దెబ్బతింది. గోదాముల్లో కుదవబెట్టిన ఉల్లి మాత్రం ఇప్పుడు మార్కెట్‌కు రావడంతో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి రోజూ 7 నుంచి 11 లారీలు మాత్రమే వస్తున్నాయి. ఇక కర్నూలు నుంచి ఉల్లి ఆగస్టు 15నుంచి మార్కెట్‌కు వస్తుందని వ్యాపారులు ఎదురు చూశారు. కాని ధర పడిపోతుందనే భయంతో రైతులు ఇంకా అమ్మకాలు మొదలు పెట్టలేదు. నిల్వలు వేసుకుని అక్కడ రైతులు కూర్చున్నారు. ధర పెరిగిన తరువాత అమ్మకాలు కొనసాగిద్దామనే ధీమాలో కర్నూలు రైతులు ఉన్నారు. ఈమేరకు మార్కెట్‌కు కర్నూలు ఉల్లి రావడం లేదు. ఇక పెద్ద దిక్కుగా మహారాష్ట్ర ఉల్లే ఉంది. కర్నూలు ఉల్లి వస్తే ధర పడిపోతుందని వ్యాపారులు చూస్తున్నారు.

నిలకడగా కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఈ వారం పెద్ద మార్పులేదు. పచ్చిమిర్చి మాత్రం కిలోకు రూ.30 పెరిగింది. గత వారం కిలో రూ.50 ఉండే పచ్చిమిర్చి ఈవారం రూ.80కు పెరిగింది. బీరకాయలు కిలోకి రూ.10 పెరిగింది. గతవారం కిలో రూ.30 ఉంటే ఈవారం రూ.40కు విక్రయించారు. తెల్లవంకాయలు కిలో రూ.50, నల్లవంకాయలు రూ.40, బెండ రూ.30, దొండ రూ.30 టమాటా కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య అమ్మకాలు జరిగాయి. కాకర కాయలు కిలో రూ.50 చొప్పున అమ్మకాలు జరిపారు.

పెరిగిన బ్రాయిలర్ చికెన్

బ్రాయిలర్ చికెన్ ధర కిలోకు రూ.20 పెరిగింది. గత వారం కిలో రూ.200 ఉండగా ఈ వారం రూ.220కు విక్రయించారు. లేయర్స్ మాత్రం ధర నిలకడగానే ఉంది. లేయర్ కిలో రూ.200కు విక్రయిస్తున్నారు.

టీచరు డిప్యుటేషన్‌పై ఏపీటీఎఫ్ అభ్యంతరం

ఏలూరు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా పెదవేగి మండలం రామచంద్రాపురం జడ్పీ హైస్కూలులో సోషల్ స్టడీస్ బోధిస్తున్న టీచరును మౌఖిక ఆదేశాలతో పెదవేగి జడ్పీ హైస్కూలు ప్లస్‌కు మండల విద్యాధికారి డిప్యుటేషన్‌పై పంపడాన్ని ఏపీటీఎఫ్-1938 నాయకులు జి.కృష్ణ, రామ్మోహనరావు, మోహన్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. రామచంద్రాపురం హైస్కూలులో వంద మంది విద్యార్థులకు సోషల్‌స్టడీస్ సబ్జెక్టును బోధించేందుకువున్న ఒకే ఒక్క టీచరును మరో పాఠశాలలో ఇంటర్మీడియట్ కామర్స్ సబ్జెక్టును బోధించడానికి ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే పెదవేగి జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇద్దరు సోషల్ సబ్జెక్టు టీచర్లు పనిచేస్తుండగా, నిబంధనలకు విరుద్ధంగా రామచంద్రాపురం స్కూలు టీచరుకు డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేసిన ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తాడేపల్లిగూడెంలో జెండా ఎగురవేసిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు

పోరాటాలు చేసిన చరిత్ర ఏపీయూడబ్ల్యూజేదే

- ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్

తాడేపల్లిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే)దేనని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ పేర్కొన్నారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక గాంధీ మండపంలో యూనియన్ పతాకాన్ని సీనియర్ పాత్రికేయుడు షేక్ ఖాదర్ మొహిద్దీన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957 ఆగస్టు 17న ఆవిర్భవించిన ఏపీయూడబ్ల్యూజే గత 68ఏళ్లుగా జర్నలిస్టులకు సంబంధించి ఎన్నో సమస్యలు పరిష్కరించిందన్నారు. యూనియన్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు యడ్లపల్లి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గణపతి వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు, ఎలక్ట్రానిక్ మీడియా మాజీ అధ్యక్షుడు పాలడుగు సతీశ్, ప్రెస్‌క్లబ్ పూర్వాధ్యక్షుడు చిట్యాల రాంబాబు మాట్లాడారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీ లక్ష్మయ్య, శీలిరాజు, ఏవీ రామరాజు, తేతలి గంగాధరరెడ్డి, యద్దనపూడి సుబ్బారావు, ఎం.రవికిరణ్, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం


శ్రీవారి వకుళమాత అన్నప్రసాద భవనంలో భోజనాలు చేస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో గోవింద నామస్మరణ మార్మోగింది. దాదాపు 15వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండడంతో భక్తులు తడుస్తూనే ఆలయంలో రాకపోకలు సాగించారు.

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రీవారి ఆలయ అనివేటి మండప ఆవరణలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం కావడంతో మహిళాభక్తులతో ఉచితంగా పూజలు నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆ రోజున ఉదయం 9.30 గంటల నుంచి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. మహిళా భక్తులు ముందుగా తమ పేర్లను స్థానిక పాదుకా మండపం వద్దనున్న సమాచారకేంద్రంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

నేటి నుంచి లక్ష్మీపురం శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు

పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభ మవుతాయని ఆలయ ఈవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. వీటిని ఈనెల 21 వరకు నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ప్రతీ ఏటా వీటిని నిర్వహించడం సంప్రదాయం. ఉత్సవాల్లో భాగంగా 18న సాయంత్రం అంకురా ర్పణ, 19న పవిత్రాధివాసం, 20న పవిత్రారోపణ, 21న జరిగే శ్రీమహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మకు భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో వున్న వనదేవత గుబ్బల మంగమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నందున అమ్మవారి దర్శనాలకు వచ్చే భక్తులు సంఖ్య రెండు వారాలపాటు తగ్గింది. ఆదివారం ఉదయం వాతావరణం పొడిగా ఉండడంతో భక్తులు అధికంగానే దర్శనాలకు తరలివచ్చారు. దర్శనం అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం నుంచి వర్షాలు ప్రారంభం కావడంతో అటవీ ప్రాంతం నుంచి త్వరగా బయటకు వెళ్లాలని ఆలయ కమిటీవారు తెలపడంతో సాయంత్రం నాలుగు గంటలలోపు భక్తులు తమ ఇళ్లకు బయలుదేరారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను కమిటీ వారు పర్యవేక్షించారు.

రిటైర్డు ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

- సెప్టెంబరు 13న విజయవాడలో రాష్ట్ర సదస్సు : సత్తిరాజు


సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరాజు

భీమవరంటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, పరిపాలనకు దోహదపడి ఏళ్ల తరబడి సేవలు చేసిన రిటైర్డు ఉద్యోగులు, కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు ఆరోపించారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో టి. గంగరాజు అధ్యక్షతన అసోసియేషన్ జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్‌లో 95శాతం పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు ఉంటే ప్రతి ఏడాది వడ్డీ కింద రూ.54వేల కోట్లు వస్తుంటే కేవలం రూ.14 వేల కోట్లతో పెన్షన్లు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల్ని మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తుంటే ఎన్నికల ముందు వాగ్దానాలు చేస్తున్న పాలకులు అనంతరం విస్మరించడం తగదన్నారు. వచ్చేనెల 13న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.అజయ్‌కుమార్, రిటైర్డు ఉద్యోగులు, తదితరులు మాట్లాడారు.

ఎరువుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

- ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా


ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరుసిటీ/కామవరపు కోట, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలను ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎరువుల డీలర్లకు ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎరువులు షాపులను తనిఖీ చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. డీలర్లు రైతులకు యూరియా, ఇతర ఎరువులను విక్రయించిన తక్షణమే ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ నందు రైతు ఆధార్ సహాయంతో ఈ-పోస్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. కానీ జిల్లాలో డీలర్లు ఎరువులను విక్రయించిన తర్వాత ఆ వివరాలను సదరు పోర్టల్‌లో నమోదు చేయకపోవడం వల్ల జిల్లాకు ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈమేరకు జిల్లాలోని కామవరపుకోట మండలం తడికలపూడి, కామవరపుకోట, గ్రామాల్లోనూ, పెదవేగి మండలంలోని ఎరువుల షాపులను ఆకస్మిక తనిఖీలు చేసి కొంతమంది డీలర్ల వద్ద వ్యత్యాసాలు ఉన్నట్లు గమనించామన్నారు. సదరు మండల వ్యవసాయ శాఖ అధికారులను తక్షణమే ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో రికార్డు చేయాలని ఆదేశించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):ఒంగోలులో ఈనెల 20 నుంచి 25 వరకు జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం నూజివీడులో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో ఎంపికయ్యే రాష్ట్ర సీపీఐ నూతన నాయకత్వం మహాసభ వేదికగా రాష్ట్ర భవిష్యత్‌కు మార్గదర్శకత్వం చేసే పద్ధతిలో పలు తీర్మానాలను ఆమోదించనుందని అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకుడు గుంట సుబ్బారావు పాల్గొన్నారు.

కుమారుడి అదృశ్యం.. కేసు నమోదు

భీమవరం క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు ఈనెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదని స్థానిక గాంధీ నగర్‌కు చెందిన బొర్రా పెద్దిలక్ష్మి టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పెద్దిలక్ష్మి కుమారుడు దుర్గా నరసింహస్వామి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తొమ్మిదేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఈమధ్య కాలంలో మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 16వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు

ఉండి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):తన తండ్రి కనిపించడం లేదని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. ఆదివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి గ్రామానికి చెందిన జోగి కాశీవిశ్వరరావు అనే వృద్ధుడు ఒంటరిగా ఉంటున్నాడు. ఆయన భార్య హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు జోగి దుర్గారావును చూసేందుకు వెళ్లడంతో అప్పటినుంచి తండ్రి ఉండిలో ఒంటరిగానే వుంటున్నాడు. ఈనెల ఏడో తేదీన గ్రామంలో వుంటున్న తండ్రికి ఫోన్ చేయగా సమాచారం రాలేదు. అప్పటినుంచి ఆచూకీ లభ్యంకాలేదు. ఈ మేరకు ఉండిలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఐటి మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి నిమ్మల.. వధూవరులతో మంత్రి లోకేశ్ తదితరులు

వైభవంగా మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం

పాలకొల్లు/పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఇంట పెండ్లి సందడి మొదలైంది. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని కల్యాణ మండపంలో మంత్రి నిమ్మల రామానాయుడు, సూర్యకుమారి దంపతుల కుమార్తె శ్రీజ నిశ్చయ తాంబూలాల వేడుక వైభవంగా జరిగింది. వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన యర్రింకి వెంకట సూర్యనారాయణ, కరుణమణి దంపతుల కుమారుడు పవన్‌కు వివాహ నిశ్చయ తాంబూలాలను బంధు,మిత్రుల మధ్య స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గజమాల, పూల బొకేలతో ఘన స్వాగతం పలికి మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా శ్రీజ, పవన్‌లకు లోకేశ్ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

పార్టీ చొక్కాతోనే డాక్టర్ నిమ్మల

ప్రజా జీవితంలో రాజకీయ నాయకులకు కొన్ని సిద్ధాంతాలు, నిబద్ధత ఉంటాయి. ఆ నిబద్ధతను జీవితంలో ప్రతీ సందర్భంలోనూ పాటించడం చాలా అరుదుగా చూస్తుంటాం. అటువంటి వ్యక్తిత్వం మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుది. టీడీపీ నాయకుడిగా, రాష్ట్ర మంత్రిగా నిత్యం పార్టీ రంగు అయిన పసుపు చొక్కానే ధరించి కనిపిస్తారు. తాజాగా తన కుమార్తె వివాహ నిశ్చితార్థంలోనూ అదే పసుపు చొక్కాతో కనిపించడం ఆయన నిబద్ధతకు, పార్టీ పట్ల ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనం.

విస్తృతంగా వాహనాల తనిఖీలు


ఏలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు క్రైం, ఆగస్టు17 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదార్లపై పోలీసులు ఆదివారం సాయంత్రం విస్తృతంగా వాహ నాల తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు, రికార్డులతో పాటు ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండాలని సూచించారు.

23,24 తేదీల్లో వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 23,24వ తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 14 ఏళ్ల పైబడిన వారే పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించినట్టు తెలిపారు. క్లస్టర్ స్థాయిలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.పదివేలు, ద్వితీయ బహుమతి రూ.ఏడు వేలు, తృతీయ బహుమతి రూ.ఐదు వేలు, నాలుగో బహుమతి రూ.మూడు వేలుగా నిర్ణయించారు. విజేతలుగా నిలిచిన వారు సెప్టెంబరులో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఫైనల్ పోటీలను సెప్టెంబరు 21న తమిళనాడులోని కొయంబత్తూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫైనల్ విజేతలకు మొదటి బహుమతిగా రూ.5లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా లక్ష రూపాయలు అందిస్తామన్నారు. ఉత్సాహవంతులైన గ్రామీణ, పట్టణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఇషా ఫౌండే షన్ వలంటీర్లు సత్య గంగాధర్, జయసాయి ప్రసాద్ కోరారు. మరిన్ని వివరాలకు 95819 01043, 93461 87098 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని ట్యాంకర్ లారీ బోల్తా


రమణక్కపేట వద్ద పడిన ట్యాంకర్ లారీ

జీలుగుమిల్లి, ఆగస్టు 17: (ఆంధ్ర జ్యోతి): జీలుగుమిల్లి మండలం రమణక్కపేట వద్ద రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ లారీ బోల్తా పడింది. ఆదివారం జీలుగుమిల్లి నుంచి జంగారెడ్డిగూడెం వైపు ఖాళీ ట్యాంకర్ లారీ వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈమేరకు ట్యాంకర్ లారీ రోడ్డు మార్జిన్‌లో పడి తిరగబడింది. ఢీకొని గుర్తుతెలియని లారీ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ లారీలో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వి.క్రాంతికుమార్ పరిశీలించారు.

క్రైం సమాచారం

ఆగిన లారీని ఢీకొట్టిన మరో లారీ

- డ్రైవర్, క్లీనర్ మృతి


ప్రమాదానికి గురైన కొబ్బరికాయల లారీ

కొయ్యలగూడెం, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ మృతి చెందిన ఘటన కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం జాతీయ రహదారిలో పవర్‌గ్రిడ్ వద్ద జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. ఆదివారం తెల్లవారు జామున పాలకొల్లు నుంచి కొబ్బరికాయల లోడుతో హైదరాబాద్‌కు లారీ వెళ్తుంది. ఈ లారీ ఆదివారం అర్ధరాత్రి కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం దగ్గర పవర్‌గ్రిడ్ వద్దకు వచ్చేసరికి లోడు ఒరిగి ఉండడంతో లారీని నిలుపుదల చేసి డ్రైవరు, క్లీనరు దిగి కొబ్బరికాయల లోడు సరిచేసుకుంటున్నారు. అదే సమయంలో మరో లారీ వేగంగా ఢీకొనడంతో డ్రైవరు, క్లీనర్ తీవ్రగాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో డ్రైవర్ పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన నౌడి రాజేశ్ (30) అదే మండలం కోడేరు గ్రామానికి చెందిన క్లీనర్ కొడదాసి లక్ష్మణరావు (35) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిఇద్దరి పైనుంచి వాహనాలు వెళ్లిపోవడంతో మృతదేహాలు నుజ్జునుజ్జయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పక్కకు తీశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



టి.నరసాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన టి.నరసాపురం మండలంలో ఆదివారం జరిగింది. టి.నరసాపురం పంచాయతీలోని కె.రామన్నపాలెం గ్రామంలో కొరివి ప్రసాద్‌కు చెందిన పాడిగేదెను మేత కోసం జాడు చేనులోకి తోలగా అప్పటికే కొబ్బరి మట్టపడి తెగిన కరెంట్ వైరుకు పాడిగేదె తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె సుమారు లక్షా 20 వేలు రూపాయల విలువ ఉంటుందని తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం.. 31 మందికి గాయాలు


పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న డాక్టర్


కాలుపై కరిచిన దృశ్యం

పాలకొల్లుటౌన్,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం పిచ్చికుక్క కాటుకు పలువురు గాయపడ్డారు. పెద్దగోపురం పరిసరాల్లో స్థానికులను ఆదివారం ఉదయం ఒక పిచ్చికుక్క కరిచిందని స్థానికులు, బాధితులు తెలిపారు. వాహనాలపై వెళ్లేవారిని తరమడం, నడిచి వెళ్లేవారిని కరుస్తూ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సమాచారం తెలుసుకున్న మునిసి పల్ కమిషనర్ విజయ సారథి వెంటనే స్పందించి కుక్కలను పట్టుకునే వారి సహకారంతో గోపురం పరిసరాల్లో గాలించి కుక్కను పట్టుకున్నారు. సుమారు 40 మందిని కుక్క కరిచిందని సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సుష్మ మాట్లాడుతూ ఆసుపత్రిలో 31 మందికి ర్యాబిస్ వ్యాక్సిన్ వేసి వైద్యం అందించినట్టు తెలిపారు. మిగిలిన వారు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి ఉండవచ్చని సమాచారం

పామాయిల్ గెలల చోరీ


పామాయిల్ గెలలను చోరీ చేసి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

ముసునూరు,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని గోపవరం శివారు పెద్దపాటివారిగూడెంకు చెందిన రైతు వడ్డపట్ల వెంకటేశ్వర రావు తన 3.5 ఎకరాల్లో పామాయిల్ పంట వేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఆగంతుకులు పామాయిల్ గెలలను కట్ చేసి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా తోటలోకి వచ్చిన పాలేరు కొత్తూరు జీయన్ రైతుకు సమాచారం ఇచ్చాడు. రైతు, అతడి కుమారుడు గణేష్ వచ్చే సరికి పామాయిల్ గెలల లోడ్‌తో వారు పరారయ్యారు. గణేష్ వారిని వెంబడించి, బలివే వద్ద ట్రాక్టర్‌ను అడ్డుకోగా, డ్రైవర్‌తోపాటు మరికొంత మంది అతనిపై దాడిచేసి లోడ్‌తో పారిపోయారు. దీనిపై గణేష్ ఆరా తీయగా దెందులూరుకు చెందిన షైనేడు, సతీష్, తులసి, బాలాజీతోపాటు మరో ఐదుగురు చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



ఏలూరుక్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఏలూరు మార్కెట్ యార్డు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాలివి.. చెన్నైకి చెందిన రియ్యాల మునిబాబు(46) ఆరేళ్ల క్రితం తన భార్య పిల్లలతో గొడవపడి ఏలూరులోని మార్కెట్ యార్డు సమీపంలో వీవీ నగర్‌లో ఒక గదిని అద్దెకి తీసుకుని నివాసముంటున్నాడు. బ్రాందీ షాపులో పనిచేస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 15వ తేదీ నుంచి షాపు వద్దకు పనికి వెళ్లడం లేదు. మద్యం తాగి గదిలోనే పడుకుని ఉన్నాడు. ఆదివారం రాత్రి ఆ గది నుంచి దుర్గంధం వెదజల్లడంతో చుట్టుపక్కల వారు గమనించి ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి, మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేడు అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

ఆకివీడు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో అదనపు తరగతి గదులకు సోమవారం సాయంత్రం 3 గంటలకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి శంకుస్థాపన చేస్తారని ప్రిన్సిపాల్ కె. సుజాత తెలిపారు. ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించారని తెలిపారు. ఎల్ఐసీ రాజమండ్రి యూనిట్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహా హాజరవుతారని తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

పాలకోడేరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధి ఉన్న వారికి వేరికోస్ వెయిన్స్ సమస్యలు వస్తాయని అందువల్ల షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలని ఎండో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం శృంగవృక్షం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి సుమారు వంద మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా కలర్ డాప్లర్ పరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. వీరందరిని బుధవారం హైదరాబాద్ తీసుకువెళ్ళి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కొత్తపల్లి

నరసాపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రిలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం 22 మంది రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్, డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు, కోపల్లి శ్రీనువాస్, పోలిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

రెయిన్‌కోట్‌ల పంపిణీ



తణుకు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తణుకు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు వృత్తులు చేసుకొనే వారికి రూ.8వేల విలువైన రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. ఆదివారం తణుకులో జరిగిన కార్యక్రమంలో పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత నాయకులు డా.కోడూరి రాధాపుష్పావతి, కె.రాజరాజేశ్వరరావు, శారదాదేవి, చిట్టూరి సుజాత పాల్గొన్నారు.


తాళ్ళకోడులో బురదమయమైన రహదారి

రహదారులు జలమయం


పెనుగొండ-మార్టేరు రహదారిపై గోతుల్లో నిలిచిన నీరు

ఆకివీడు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పనపూడి పంచాయతీలోని తాళ్ళకోడు కాలనీలో రహదారులు వర్షానికి జలమయమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచి పోతున్నది. దీనికి తోడు రహదారులపై గోతులు ఏర్పడటంతో నీళ్ళు నిలిచి రహదారు లన్నీ అధ్వానంగా మారాయి. కాగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కొన్ని రోడ్లు వేయించారు. ఆకివీడు నగర పంచాయతీ, కుప్పనపూడి పంచాయతీల మధ్య సమస్యల చట్రంలో నలిగిపోతున్నామని తాళ్ళకోడు వాసులు వాపోతున్నారు.

ఉండి: వర్షం వస్తే రహదారులపై వర్షం నీరు చేరి దారులు కనిపించకుండా మునిగిపోతున్నాయి. మండలంలో పలు రహదారులు అధ్వానంగా మారాయి. ఉండి నుంచి మహదేవపట్నం వెళ్లే రామచంద్రపురం రహదారి అధ్వానంగా మారింది. ఉప్పులూరు నుంచి యండగండి వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఉండి, నుంచి వాండ్రం వెళ్లే ఆర్అండ్ రహదారి గోతులమయంగా మారింది.

పెనుగొండ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా పెనుగొండ మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు బురదమయంగా మారాయి. మార్టేరు- పెనుగొండ రోడ్డులో అక్కడక్కడ ఏర్పడిన గోతుల్లో నీరు నిలిచిపోయాయి.ప్రజలు ఇళ్ళకే పరిమితం అయ్యారు.

రైతులంతా క్రాప్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి


ముంపు చేలో నారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి) : రైతులందరూ తప్పని సరిగా క్రాప్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆది వారం ప్రచురితమైన నిర్లక్ష్యం ముంచేసింది కథనానికి స్పందనగా ఆదివారం ఆయన మండలంలోని కే.పెంటపాడు, పరిమెళ్ళ యానాలపల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. ముంపు పొలలకు సంబంధించిన రైతులతో మాట్లాడారు. వర్షంలో మునిగి పాడైన వరి దుబ్బులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ రైతులు క్రాప్ ఇన్సూరెన్స్‌పై నిర్లక్ష్యం వహించవద్దని, దీనికి సంబంధించి ఏవో చీర్ల రవికుమార్‌ను సంప్ర దించాలన్నారు. డ్రెయిన్లు ప్రక్షాళన కార్యక్రమాలు చేసేప్పుడు రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పుల్లాబాబి, తోట రాజ, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, పీతల సత్యనారాయణ, వీర్ల కృష్ణ, తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వాకర్స్‌కు కుక్కలు, పందులు, పాముల బెడద


వాకింగ్ ట్రాక్ వద్ద సంచరిస్తున్న పందులు, కుక్కలు

తణుకు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి రోడ్డులోని చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజీ వాకింగ్ ట్రాక్‌లో వాకర్స్‌కు కుక్కలు. పందులు, పాముల బెడద తప్పడం లేదు. పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఉదయం, సాయంత్రం వాకర్స్ వస్తుంటారు. వాకర్స్ నడిచే సమయంలో అకస్మాత్తుగా పందులు, కుక్కలు, పాముల సంచారంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలం నుంచి సమస్య తీవ్రంగా ఉన్నది. నాలుగు రోజుల క్రితం ఒక ఎద్దు వాకర్స్ గ్రౌండ్‌లో హల్‌చల్ చేసింది. వాకర్స్‌పైకి దూసుకురావడంతో జనం పరుగులు పెట్టారు. అనేక సందర్భాల్లో పలువురు వాకర్స్ అధికారుల దృష్టిలో కూడా పెట్టడం జరిగిందని చెబుతున్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. గడ్డి కూడా ఏపుగా పెరిగి ఉండటం, వర్షపు నీరు నిలిచి ఉండటంతో పాముల సంచారం కూడా ఎక్కువైందని వాకర్స్ వాపోతున్నారు.

వందలాది మంది వాకర్స్

ప్రతి రోజు వందలాది మంది వాకర్స్ గ్రౌండ్‌కు వస్తుంటారు. చాలా సందర్భాలలో ట్రాక్ బాగా లేనప్పుడు దాతలు, వాకర్స్ అసోసియేషన్ తరుపున గ్రావెల్‌తో పూడ్చుకున్నారు. ప్రస్తుతం వాకింగ్ ట్రాకు చాలా అనువుగా ఉంది. ఇటీవల సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు నిధులు కూడా సమకూర్చారు.


పాలకొల్లు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఆరిమిల్లి, తోట సీతారామలక్ష్మి, నాయకర్, రామరాజు, మాధవ నాయుడు

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు

తణుకు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను పాలకొల్లులో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చితార్థానికి విచ్చేస్తున్న లోకేశ్‌ను జిల్లాలోకి ప్రవేశించగానే లోసరి గ్రామం వద్ద కూటమి నాయకులతో కలసి స్వాగతం పలికారు. అనంతరం పాలకొల్లు వెళ్ళి కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మితో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. విజయవాడ నుంచి పాలకొల్లు వెళుతున్న సమయంలో మార్గం మధ్యలో అంబేడ్కర్‌లో సెంటర్‌లో కూటమి నాయకుల్ని చూసి కారు ఆపారు. వెంటనే ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజులు లోకేశ్‌కు బొకేలతో స్వాగతం పలికారు. కొందరు నాయకులు ఆయనతో ఫొటో దిగేందుకు పోటీ పడ్డారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, పారిశ్రామికవేత్త పడాల సురేష్‌లు ఆదివారం నారా లోకేశ్‌ను కలిశారు. అనంతరం పాలకొల్లు రోడ్‌లోని లాకుపేట వద్ద స్నేహితులు ఏర్పాటు చేసిన అల్యూమినియం, గ్లాస్ రైలింగ్ షాపును మాజీ ఎమ్మెల్యేతో కలిసి ఆయన ప్రారంభించారు.

పెనుగొండ: పాలకొల్లు నుంచి పెనుగొండ మీదుగా రాజమండ్రి ఎయిర్ పోర్టుకు వెళుతున్న మంత్రి నారా లోకేశ్‌ను పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల సెంటర్‌లో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభివాదం తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ తన వాహనంలో నుంచి దిగి కార్యకర్తలు, నాయకులతో కరచాలనం చేశారు. ఆయనను కలిసిన వారిలో సొసైటీ చైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి, సర్పంచ్ నక్కా శ్యామలా సోని, చలుమూరి శేఖర్, కటికిరెడ్డి నానాజీ తదితరులు ఉన్నారు.


వేంకటేశ్వర స్వామికి కృష్ణుడి అలంకరణ

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల వద్ద ఆదివారం ఉట్టి కొట్టి వేడుకలు జరిపారు. 24వ వార్డు శంభేశ్వర స్వామిఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించారు. ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామిని గోపాల కృష్ణునిగా అలంకరించారు. సాయంత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉట్టి కొట్టారు.

జనసేనలో చేరిక

తాడేపల్లిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జనసేన పార్టీలో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. రేలంగి చిత్రమందిర్ ఆవరణలో ఆదివారం జనసేన పార్టీలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బొడ్డు సాయిబాబా, రెడ్డి సేవాసంఘం నాయకుడు కొవ్వూరి నాగేంద్రరెడ్డిలు జనసేనలో 500 మంది వారి అనుచరులు చేరారు. వీరంతా గతంలో వైసీపీలో ఉన్నావారే కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నిస్వార్థరాజకీయాలకు స్పందించే జనసేనలో చేరుతున్నారన్నారు. ఇప్పుడు ఎలాంటి ఎన్నికలు లేవు అయినా చేరుతున్నారంటే వారికి జనసేన నాయకత్వంపై ఉన్న నమ్మకమన్నారు. బియ్యం, ఇసుక, గ్రావెల్ అమ్ముకుని సొమ్ముచేసుకున్న ఘన చరిత్ర కొట్టు సత్యనారాయణదేనన్నారు.

నీచ రాజకీయాలు చేస్తున్న కొట్టు

వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన వాళ్లంతా కేటుగాళ్లు అని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అనడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి అన్నారు. తన పార్టీలో కొనసాగితే వాళ్ల కేటుగాళ్లగా కనిపించరేమో అప్పుడు వీళ్లంతా మంచివాళ్లగానే కనిపిస్తారా అని విమర్శించారు. మీ దగ్గర ఉన్నవారిని ఎవ్వరిని ఎదగనిచ్చావని ప్రశ్నించారు. ఎందుకు నీ దగ్గర ఉండాలని నిలదీశారు. మున్సిపల్ చైర్మన్‌గా బొడ్డుసాయి పోటీ చేస్తే వెన్నుపోటు పొడిచి ఓడించావని విమర్శించారు. నీచ రాజకీయాలకు పెట్టింది పేరుగా కొట్టు సత్యనారాయణ నిలుస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వర్తనపల్లి కాశీ, పుల్లా బాబి, పైబోయిన వెంకట్రామయ్య, పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు, అడపా ప్రసాద్, జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నరేన్ ప్రమాణ స్వీకారం

నరసాపురం రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్రు సొసైటీ చైర్మన్ అందే నరేన్, డైరెక్టర్లు మాసేనురావు, భాస్కర రామస్వామి ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. సొసైటీ భవనం వ్ద జరిగిన ఈకార్యక్రమంలో ప్రభుత్వ విప్ నాయకర్, మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీఎం చైర్మన్ చాగంటి చిన్న, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు హాజరై నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని అభినందించారు.

జనసేన గూటికి వైసీపీ ఎంపీటీసీ

జనసేన పార్టీ కార్యాలయంలో మల్లవరం వైసీపీ ఎంపీటీసీ ఇంజేటి మేరీరత్నంతో పాటు వెంకట్రావు, ఇంజేటి రమేష్, చంటి, రామారావులతో పాటు మరో 50 మంది నాయకులు జనసేన గూటికి చేశారు. వీరికి ప్రభుత్వ విప్ నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

నరసాపురం టౌన్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా సోమవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేశారు. అలాగే మండల కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం ఉండదన్నారు. ఫిర్యాదుదారులు గమనించాలన్నారు.

పులివెందుల్లో అరాచక శక్తులకు చెక్

పెనుమంట్ర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది. అప్రజాస్వామ్యంగా అరాచక శక్తులకు ప్రజలు చెక్ పెట్టారు. దీంతో టీడీపీ పులివెందులలో పాగా వేసిందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెలగల బుల్లి రామిరెడ్డి అన్నారు. గతంలో స్థానిక సంస్థల్లో ఎంపీటీసీగా జడ్పీటీసీగా సర్పంచులుగా నామినేషన్ వేయకుండా వైసీపీ రౌడీ మూకలు అరాచకాలు సృష్టించారని ఆరోపించారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే వైసీపీ పేటీఎం బ్యాచ్ అప్రజాస్వామ్యం అని రంకెలు వేస్తున్నారని మండి పడ్డారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం


పందిరి రాటకు పూజలు చేస్తున్న టీడీపీ వార్డు కౌన్సిలర్ శ్యామల

ఆకివీడు ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలకు పలు చోట్ల ఆదివారం పందిరి రాటలు వేశారు. ఈ నెల 27వ తేదీ వినాయక చవితి పురస్కరించుకొని స్థానిక సాలిపేటలో యువత ఏర్పాటు చేస్తున్న విగ్రహం పందిరి రాటకు వార్డు కౌన్సిలర్ బత్తుల శ్యామల పూజలు చేశారు. ఈ ఏడాది ఉత్సవాలు మంచిగా జరగాలన్నారు.

విద్యుత్ సమస్యలపై ఆక్వా రైతులతో భేటీ

కాళ్ళ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజుతో ఆక్వా రైతుల ప్రతినిధులు సమావేశమైనట్లు ఆయన కార్యాలయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వర్షాకాలంలో ఎక్కువగా తలెత్తే సీటీబీటీ (కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ అండ్ బ్రేకర్ టెస్టింగ్) సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఒక్క విజిలెన్స్ ఏఈ పరిధిలోనే సీటీబీటీ అజమాయిషీ ఉండటం వల్ల ఏదైనా సమస్య తలెత్తినప్పుడు రైతులు 4-5 రోజులు విద్యుత్ అంతరాయం ఎదుర్కొని, డీజిల్‌పై అధిక వ్యయం చేసి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని రైతులు వివరించారు. రైతుల అభ్యర్థన మేరకు ప్రతి ఏడీఈ పరిధిలోకి సీటీబీటీను తీసుకువచ్చి ట్రాన్స్‌ఫార్మర్ స్టోర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ ప్రతిపాదనను రఘురామకృష్ణరాజు వెంటనే విద్యుత్ శాఖ సీఎండీకి ఫోన్‌లో తెలిపారు. దీనిపై సీఎండీ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

సమసమాజ నిర్మాణానికి ముందుకు రావాలి

భీమవరం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం వైపు ప్రజలంతా అడుగులు వేయాలని రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద స్వాతంత్ర్య పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భీమవరంలో 1942 ఆగస్టు 17న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో భూపతిరాజు సుబ్బ తాతరాజు, దంతులూరి నారాయణరాజు, అడవి బాపిరాజు, గొట్టుముక్కల రామచంద్రరాజు లాంటి వారి నాయకత్వంలో ఆనాడే స్వాతంత్ర్యం వచ్చినట్లు ఉద్యమం సాగించి గ్రామగ్రామన ఉద్యమ స్ఫూర్తిని కలిగించారని అన్నారు. ఈ క్విట్ ఇండియా స్థూపం ఒక పర్యాటక కేంద్రంగా చేయడానికి మనందరం కృషి చేద్దామన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. పక్షోత్సవాల కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశి విశ్వనాధరాజు, రాష్ట్ర మునిసిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

సీపీఐ సేవాదళ్ సభ్యులకు శిక్షణ

తణుకు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సందర్భంలో బాధితులను ఆదుకోవడంలో సీపీఐ జనసేవాదళ్ వలంటీర్లు కృషి అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఈనెల 19,20 తేదీలలో తణుకులో జరిగే సీపీఐ జిల్లా మహాసభలు 23 నుంచి 25వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజా ప్రదర్శనల్లో పాల్గొనే రెడ్‌షర్టు జనసేవాదళ్ వలంటీర్లకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం వలంటీర్ల కవాతు నిర్వహించారు.

శ్రీకృష్ణుడికి గులాబీలతో అలంకారం



భీమవరం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 17వ వార్డు వేణుగోపాల స్వామి మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా ఆదివారం గులాబీ పూలతో అలంకరణ చేశారు. పట్టణానికి చెందిన వెలివిలి కృష్ణ దంపతులచే ఆలయ అర్చకులు శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గులాబీ పూలతో పూజ చేసి అలంకరణ చేశారు.

విజేతలకు బహుమతులు

ఉండి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):కృష్ణాలయంలో జరిగిన కృష్ణష్టమి వేడుకలలో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న విజేతలకు కృష్ణచైతన్య ఆశ్రమం ఇన్‌చార్జి కృష్ణదాస్ బ్రహ్మచారి చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఆదివారం కొత్తపేటలో వున్న ఆశ్రమం వద్ద జరిగిన కార్యక్రమానికి గ్రామంలోని విద్యార్థులు విచ్చేసి శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను భక్తులకు అందించారు.

మెంటేవారి తోటలో ఉట్టికొట్టే కార్యక్రమం


ఉట్టికొడుతున్న విద్యార్థులు

భీమవరం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మెంటేవారి తోటలోని బాల త్రిపుర సుందరి ఆలయం వద్ద ఆదివారం చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు కృష్ణుడి విగ్రహాలకు దంపతులతో పూజలు చేయించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి బహుమతులను అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

మొగల్తూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఐకేపీ ఏపీఎం ప్రభుదాస్ తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈరక్తదాన శిబిరంలో రక్తదానం చేసేవారు పాల్గొనాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రక్తం సేకరిస్తారన్నారు.

ఎంఈవో-1గా సాయిరాం

మొగల్తూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండల విద్యాశాఖాధికారిగా గుమ్మళ్ళ సాయిరాం బాధ్యతలు స్వీకరించారు. పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయన తాత్కాలిక సర్దుబాటులో భాగంగా మొగల్తూరు ఎంఈవో-1గా నియమించడంతో ఆయన ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. సాయిరాంకు ఎంఈవో టూ శ్యామ్యూల్ జాన్, ఉపాధ్యాయులు, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

కంచుమర్రు సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

అత్తిలి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం కంచుమర్రు సర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజును తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి పరామర్శించారు. ఇటీవల కృష్ణంరాజు తండ్రి వెంకట సుబ్బరాజు మృతి చెందడంతో కృష్ణంరాజును ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పాలూరు సొసైటీ అధ్యక్షుడు అల్లూరు ధనరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వలవల శ్రీరామమూర్తికి ఘన నివాళి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు, యూటీఎఫ్ నేత వలవల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని వదిలి పార్టీలో చేరి పలు పోరాటాలకు సారథ్యం వహించారని, ఆయన లేని లోటు తీరనిదన్నారు. శ్రీరామమూర్తి కుమారులు వలవల రవీంద్ర, రామకృష్ణ తమ తండ్రి జ్ఞాపకార్థం పార్టీ కార్యాలయానికి 15 కుర్చీలు బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, తొట్టెంపూడి కోటేశ్వరరావు, జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, కె రాయపరాజు, తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు


తాడేపల్లిగూడెంలోని మిలటరీ మాధవరంలోని చెరువు చుట్టూ ఉండే రోడ్డు వద్ద ప్రమాదకరంగా మలుపు


పెనుగొండ - వడలి మార్గమధ్యంలో ఉన్న మలుపు


వెంకటరామపురం-పెనుగొండ రహదారిలో మలుపు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే మిలటరీ మాధవరంలోని చెరువు చుట్టూ ఉండే రోడ్డు మలుపులతో ప్రమాదాలకు ఆహ్వానంగా మారింది. చెరువు చుట్టూ ఉండే మలుపులకు తోడు చెరువు పక్కన ఆక్రమణ కూడా ఈ ప్రమాదాలకు దోహదపడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా పునర్నిర్మాణ పనుల్లో ఆర్అండ్‌బీ అధికారులు ఈ చెరువు చుట్టూ ప్రమాదాలకు నిలయంగా ఉండే ఈ మలుపుల వద్ద ఆక్రమణలు తొలగించడంతోపాటు ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పెనుగొండ: మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో అనేక చోట్ల మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలకు వాహనదారులు గురవుతున్నారు. ఆయా మలుపులు వద్ద స్పీడ్ బ్రేకర్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెనుగొండ నుంచి వెంకటరాయపురం వెళ్ళే రహదారిలో ఉన్న మలుపు, పెనుగొండ నుంచి ఆచంట రహదారిలో కొఠాలపర్రు వద్ద మలుపు, దేవ నుంచి ఆచంట వెళ్ళే రహదారిలోనూ, ములమర్రు లోగ్రామంలో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బేకర్లు లేకపోవడంతో ప్రమాదాల పాలవుతున్నారు. ఆ మలుపులు వద్ద ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు. వాహనాలు ప్రమాదాలు బారిన పడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు

తణుకు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించారు. ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ తణుకు, పాతూరు. పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి పదిమందికి వైద్య సేవలందించారు. పేదలకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.